"అవునోయ్, తెల్లావారగట్ల వచ్చిన కలలు నిజమవుతాయంటారు కదూ!" అడిగాడు రేవంత్ కాఫీ కప్పు అందిస్తున్న రమ్యతో.


"అది నాకు తెలీదు గాని, ప్రొద్దునే ఇంత గొప్ప సందేహం తమరికి ఎందుకు వచ్చినట్టో" అంది రమ్య ఎదురుగా కూర్చుంటూ.

"ఏంలేదోయ్, తెల్లారుతుండగా ఐశ్వర్య నా కల్లోకి వచ్చి, రొమాంటిక్‌గా చూస్తూ ఒక్కటే గొడవ. తెగ ఇబ్బంది పెట్టేసిందిలే" గర్వంగా అన్నాడు.

"కరెక్టే సుమా?! సరిగ్గా అదే సమయంలో అభిషేక్ నా కల్లోకి వచ్చాడుగా" అంది ముక్తాయింపుగా.

అంతే...

రేవంత్ మొహం కుంపట్లో కాలిన కుమ్మొంకాయలా మాడిపోయింది.



డాక్టర్ ప్రసాద్ కల్లూరి

# స్పందించిన హృదయం

కాసేపు నిశ్శబ్దం...

అంతలో రమ్య ఆనందంగా "అవునండీ... మన పెళ్లిరోజు వచ్చే శుక్రవారమే కదూ?!" అంది.

"సారీ, జీవితంలో ఎదురైన కొన్ని హారర్ సన్నివేశాలను గుర్తుంచుకోవడం మానేసాను" రిటార్ట్ ఇచ్చినట్టు ఫీలయ్యాడు రేవంత్.

అలా మొదలైంది... ఆ ఆదివారం.

కాని ఇక్కడో చిన్న విషయం గమనించాలి. రమ్య, రేవంత్ ఎప్పుడూ ఇలా "పంచ్"లతోనే కాలక్షేపం చేస్తారనుకుంటే ముద్దపప్పులో కాలేసినట్టే.

ఏదైనా పనిమీద అతను పదిరోజులపాటు ఊరెళితే రమ్యకు తోచదు. ఆమె పుట్టింటికి వెళితే, అతను దిగులెట్టుకు కూర్చుంటాడు.

ఎదురుగా వుంటే మాత్రం ఎవరికెవరూ తగరు. పంచ్ పరంధామంలా, అర్ధరాత్రయినా అలా నడవాల్సిందే.

దీనికంతటికీ బలమైన కారణం... వాళ్లిద్దరూ జస్ట్ "ఫార్టీ ప్లస్" కావడమే...!!

టిప్‌టాప్‌గా తయారై ఇద్దరూ బయటకు వెళుతూంటే, ప్రక్కఫ్లాట్స్‌లో వాళ్లంతా కళ్లలో యాసిడ్ పోసుకోవడమే... అంతటి అన్యోన్య దాంపత్యం!

రేవంత్ అద్భుతమైన తెలుగు లెక్చరర్‌గా పేరు తెచ్చుకుంటే, రమ్య హిందీలో దిట్ట. కాలేజిలో ఇద్దరికీ ఫ్యాన్ క్లబ్స్ ఉన్నాయి.

రమ్య భాషాభిమానం ఎంత గొప్పదంటే, సరదాగా హిందీలో తిట్టి, హిందీ - తెలుగు నిఘంటువు చేతిలో పెడుతుంది అర్థం వెదుక్కోమని. రేవంత్ తక్కువ తిన్నాడా?! ఉపమాన ఉపమేయాలతో ఊదరకొట్టేస్తాడు.

అది వాళ్ల పెళ్లిరోజు.

ఎంచక్కా ఇద్దరూ తయారై, ఇంద్రకీలాద్రిపై వేంచేసివున్న కనకదుర్గమ్మను మనసారా దర్శించుకున్నారు. కొంతసేపు ఆలయంలో గడిపిన తరువాత బైక్ తీస్తున్న రేవంత్‌ని అడిగింది తరువాత కార్యక్రమం ఏమిటని.

"ఇంతే, నేడు ఒక అపురూప సందర్భము. మిమ్ములను ఆనంద డోలికలలో తేల్చవలెనని మేము నిశ్చయించితిమి. ఈ సందర్భమున మిమ్ములను ఒక అద్భుతమైన తావునకు గొనిపోవలెనని మా ఆకాంక్ష. తమకిది సమ్మతమేనా... ఆ..." అంటూ అపర యన్టీఆర్‌లా, అక్కడక్కడా అవసరం లేకపోయినా వత్తిపలుకుతూ, అదే డిక్షన్‌లో చెప్పాడు రేవంత్.

"జిస్ దేశ్‌మే గంగా బెహతీహై, రామ్ తెరి

మైలీహై. ఎంద పరంద ఎంద చాట. మనసి లాయో" రమ్య సమాధానం.

ప్రక్కనే పార్క్ చేసివున్న బండిని తీయడానికి వచ్చిన ఒక పెద్దాయన వీరి సంభాషణ విని, పిచ్చిచూపులు చూస్తూ అలాగే వుండిపోయాడు.

అరగంట ప్రయాణం చేసిన బైక్ గన్నవరం పొలిమేరల్లోగల ఒక విశాలమైన ప్రాంగణం లోకి ప్రవేశించింది.

భవనంలోకి ప్రవేశిస్తూనే, ఎదురుగా ఎత్తైన పీఠం మీద హుందాగా నిలచివున్న మదర్ థెరిస్సా విగ్రహానికి మనస్ఫూర్తిగా నమస్కరించాడు రేవంత్. రమ్య అతన్ని అనుసరించింది.

ఆమె ముఖంలోని స్వచ్ఛత, చూపులలోని నిర్మలత్వం ఇద్దరినీ ఎంతో ఆకట్టుకున్నాయి.

విశాలమైన ప్రాంగణంలో, చుట్టూరా అమరివున్న అందమైన పూదోట మధ్యన అందంగా అమరివున్న రెండంతస్తుల భవన మది.

అంతలో అక్కడికి వచ్చిన సుధీర్ ప్రేమ పూర్వకంగా "నమస్తే రేవంత్‌గారూ. రండి, మీ కోసమే ఎదురుచూస్తున్నాను" అంటూ ఆహ్వానం పలికాడు.

"నమస్తే సుధీర్‌గారూ... రమ్యా, వీరు ఇక్క డి సంరక్షకులు. మనకు బాగా కావలసినవారు. ఈవిడ నా శ్రీమతి రమ్య" అంటూ పరిచయం చేసాడు రేవంత్.

ముగ్గురూ కలసి మొదటి అంతస్తులోని విశాలమైన హాలులో ప్రవేశించారు.

విశ్వంలోని ప్రేమంతా తన నవ్వులో కురిపిస్తున్న మదర్‌థెరిస్సా చిత్రపటం ఎదురుగా నిలచివుంది. ముందు వేదికపై దవళ వస్త్రాలలో వెలిగిపోతోంది ఒక నడి వయస్కురాలు - ధ్యాన ముద్రలో. ఆమెకు ఎదురుగా నేలమీద పరచిన తివాచీలపై కండ్లుమూసుకుని ధ్యానంలో వున్నారు దాదాపు యాభైమంది పిల్లలు.

వారికి ఏమాత్రం ఇబ్బంది కలిగించకుండా వెళ్లి, వెనుక వరుసలో కూర్చున్నారు ముగ్గురూ.

పావు గంట గడిచింది.

గంట మ్రోగడంతో అందరూ సాధారణ స్థితికి చేరుకున్నారు.

దగ్గరికి వచ్చిన ఆ స్త్రీని దంపతులకు పరిచయం చేశాడు సుధీర్. కామ్‌గా పరిసరాలను పరిశీలిస్తోంది రమ్య.

తను ఆ పరిసరాలకు రావడం అదే మొదటి సారి.


"రేవంత్ గారూ, మీరు కోరినట్టు అన్ని ఏర్పాట్లూ చేసాను. పదండి డైనింగ్ హాల్‌కి వెళదాం" అంటూ ముందుగా నడిచాడు సుధీర్. అతడిని అనుసరిస్తూ వెళ్లారిద్దరూ. పిల్లలంతా తెల్లని దుస్తుల్లో దేవదూతల్లా బల్లలముందు కూర్చునివున్నారు. అందరికీ రుచికరమైన భోజనపదార్థాలు వడ్డించబడి వున్నాయి. వారికి ఎదురుగా వున్న బల్ల వద్ద కూర్చున్నారు రమ్య, రేవంత్, సుధీర్.

స్పీకర్‌లో ప్రార్ధన మొదలైంది.

ముకుళిత హస్తాలతో అందరూ శృతి కలిపారు.

పిల్లలనే గమనిస్తున్న రమ్యకు వారు తినేటప్పుడు పళ్లెంలో వడ్డించిన పదార్థాలను తడుమ్ కోవడం కనబడింది. ఎందుకో తెలియలేదు. విషయం అర్థంకాలేదు.

రేవంత్‌ను అడగబోయి ఎందుకో ఆగిపో




యింది.

భోజనాలు పూర్తయ్యాయి.

తిరిగి ధ్యానమందిరంలోకి వచ్చిన దంపతులకు పిల్లలందరూ అర్ధచంద్రాకారంలో కూర్చుని కనిపించారు. ఇద్దరినీ వారికి ఎదురుగా కూర్చుండబెట్టి, తను రేవంత్ పక్కన నిలుచున్నాడు "సంరక్షకుడు" సుధీర్.

"బాలూ, మనందరికీ ఇంత మంచి భోజనాన్ని ఈ రోజు అందించిన మన ఆప్తులెవరో తెలుసా నీకు?" అడిగాడు సుధీర్ తన ఎదురుగా కూర్చున్న పిల్లవాడివైపు చూస్తూ.

"తెలుసన్నయ్యా, రమ్య అమ్మ, రేవంత్ నాన్న" అన్నాడు బాలు. అంతే, హాలంతా చప్పట్లతో మారుమ్రోగింది.

"మరి వాళ్లకి నీ స్నేహితుల తరుపున ఏమీ ఇవ్వవా" అడిగాడు సుధీర్.

"ఎందుకివ్వనూ?! ఇదిగో" అంటూ లేచి నిలబడ్డాడు బాలు. వెంటనే లేచి వెళ్లి అతని చేయి పట్టుకుని రేవంత్ వాళ్లదగ్గరకు నడిపించుకుని వచ్చాడు సుధీర్. అతని చేతిలోని పుష్ప గుచ్ఛాన్ని అందుకుని, బాలూని గుండెలకు హత్తుకున్నాడు రేవంత్. ఉద్వేగంతో రమ్య నోట మాట రాలేదు. అప్పుడు గమనించింది రమ్య.

చిదిమితే పాలుగారే బుగ్గలతో, తీర్చిదిద్దిన రూపంతో, ఎంతో అపురూపంగా వున్న ఆ పిల్లలందరికీ భగవంతుడు చేసిన లోపం... ఈ అందమైన లోకాన్ని "చూడలేకపోవడం."

ఆ ఆలోచన రాగానే గుండె బరువెక్కింది.

అందరిలాగే చూడటానికి మామూలుగా కళ్లు వున్నప్పటికీ రెటీనల్ ప్రాబ్లంవల్ల లోపించిన దృష్టి.

కానీ ఆప్యాయతను అందించడంలో ఎవ్వరికీ తాము తక్కువకామని తెలియజేసే చేతలు.

చిన్న పని వుందంటూ లేచి వెళ్లాడు సుధీర్.

అయిదు నిమిషాలు గడిచాయి.

అప్పుడు జరిగిందో అద్భుతం.

అనుభవైక వేణునాదంలో భూపాలరాగాన్ని ఆవిష్కరించాడు "బాలు". పది నిమిషాలు ఆలా పన ఆ హాలునంతా ఆప్యాయతా తరంగాలతో నింపివేసింది.

తరువాత భువన అనే పాప ఆలపించిన "ఏ దివిలో విరిసిన పారిజాతమో" పాట దంప తులిద్దరినీ ఆనంద పారవశ్యంలో ముంచివే సింది.

అన్నిటినీ మించి సాకేత్ పాడిన "మౌనం గానే ఎదగమనీ మొక్క నీకు చెబుతుంది, ఎదిగినకొద్దీ ఒదగమనీ అర్థమందులోవుంది" అన్న పాటకు ఇద్దరి నుంచీ "స్టాండింగ్ ఓవే షన్".

అలా రెండుగంటలసేపు సాగిందా కార్య క్రమం. సుధీర్ ముఖంలో తన లాలనలో ఎది గిన పిల్లల నేర్పుపట్ల సంతృప్తి. చివరిగా సుధీర్ కోరికమేరకు మాట్లాడాడు రేవంత్.

"ప్రేమ స్వరూపమైన చిన్నారులారా"

మొదటిగా మీకు కోటి దీవెనలు.

మా ఇద్దరి జీవితాలలో మరువలేని ఒక అపురూప అనుభవం మేము ఈనాడు పొంద గలిగాము.

మహాకవి చెప్పినట్లు "కన్నులుండి చూడ లేరు కొంతమంది. జనం దారితప్పి తిరుగు టయే తెలివిలేనితనం!"

అటువంటిది మీరంతా ఆత్మస్థైర్యంతో ఇంత అద్భుతంగా పాడి, మీ బాలవాక్కులతో



హైదరాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయంలో 'మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో షమీమ్ రచించిన 'ప్రేమకెరటాలు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, కిరణ్‌బాబు, షమీమ్, వై.ఎస్. వివేకానందరెడ్డి, డా॥ అద్దేపల్లి, సలీమ్, శైలజామిత్ర ఉన్నారు.

మమ్మ మనసారా దీవించారు. మీలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక ప్రతిభగలవారే. అందులో సందేహం లేదు. అవకాశం కల్పిస్తే అద్భుత స్థాయికి చేరుకునే సమర్థత మీలో వుంది. ఈ అపూర్వమైన అవకాశాన్ని మాకు కలిగించిన సుధీర్ గారికి కృతజ్ఞతలు" అంటూ ముగించాడు.

చప్పట్లు మారుమ్రోగాయి. ఆనాటి రాత్రి, రమ్య తమలపాకులు చుట్టి రేవంత్‌కి అందిస్తూ అంది... "అవునండీ, ఇంతకాలం మీరు చేస్తున్న సహాయం గురించి నాకెందుకు చెప్ప లేదు? అలా చెప్పివుంటే, మీతోపాటు నేను కూడా పాలుపంచుకునేదాన్ని కదూ" అంది కాస్త నిష్ఠూరంగా.

"పిచ్చి రమ్యా, మనిద్దరిలో ఎవరు చేసినా ఒక్కటే. కాకపోతే ప్రత్యేకించి నిన్ను ఈ రోజు అక్కడికి తీసుకువెళ్లడానికి ఓ కారణముంది.

మనం ఈ రోజు ఏ స్టార్ హోటల్‌లోనైనా గడిపివుండవచ్చు. కానీ, అంతకన్నా గొప్పదైన అనుభవాన్ని నీకు అందివ్వాలని అనుకున్నాను.

దురదృష్టంకొద్దీ ఏర్పడిన ఆ లోపం తప్ప మనోనేత్రంతోనే మనందరినీ చూడగల అదృష్ట వంతులు ఆ పిల్లలు.

నేను మాట్లాడిన తరువాత వారి ముఖాల్లో కనబడిన ఆనందం, వారి చప్పట్లలో ప్రతిబింబించింది. అంతకన్నా మనకు ఏమి కావాలి? నిజానికి నేను వారికి చేస్తున్న ఆర్థిక సహాయం కొద్దిపాటిది మాత్రమే. మనలా ఎందరో అలా చేస్తున్నారు. మనందరికీ తెలుసు... ఏదైనా అవయవలోపం గలవారిలో ఒక అద్భుతమైన ప్రతిభ మరో విధంగా వ్యక్తమవుతుంది.

అంత గొప్పగా పాడిన వాళ్ల గొంతుల్లో అంతులేని ఆత్మవిశ్వాసం, అనంతమైన ప్రేమానురాగాలు మనం గమనించలేదా?! అలాంటి వారికి మనం అందించవలసినది ప్రేమ, ఆప్యాయత, మీకంటూ మేమున్నామన్న భరోసా.

ఇతరుల మాటల్లోని జాలిని వాళ్లు ఏమాత్రం భరించలేరు. అవకాశం వుంటే ఆపన్న హస్తం అందించగలగాలి కానీ, అపహాస్యం చేయకూడదు.

ఒకసారి సుధీర్ నన్ను కలిసి, తన స్నేహితుల సహాయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గురించి వివరించాడు. దాదాపు సంవత్సరం క్రితం సంగతి. అప్పటి నుంచి ప్రతినెలా కొంత డబ్బు పంపడంతోపాటు, పండుగలకు ప్రత్యేక ఏర్పాట్ల నిమిత్తం ఎంతోకొంత పంపుతున్నాను. ఆ చిన్నారుల ముఖాలలో కనబడే తృప్తి నాకు ఆనందాన్ని కలిగిస్తుంది. అంతకుమించి నేను ఏమీ కోరను అన్నాడు రేవంత్.

రమ్య ముఖం భర్త చేస్తున్న పనిపట్ల అభినందనతో నిండిపోయింది. ఇలా ఆలోచించే వారు ఎందరు?

వారి ప్రమేయం ఏమీ లేకపోయినా, కొన్ని సందర్భాల్లో కొందరిలో కొన్ని అంగవైకల్యాలు సంభవిస్తుంటాయి. అంతమాత్రంచేత వారు ఇతరులకన్నా ఏ కారణం చేత తక్కువ?

కృత్రిమ పాదంతో నాట్యంచేసి, సాక్షాత్తూ నటరాజునే మెప్పించిన సుధాచంద్రన్ గొప్పది కాదా?! శాస్త్రీయ సంగీతంలో అద్భుత ప్రతిభ కలిగిన శ్రీ మోహనకృష్ణకు దృష్టిలోపం ఆటంకం కాలేదూ కదా?!

సంకల్పబలంతో అసాధ్యాలను సుసాధ్యం చేయగల అట్టి ప్రతిభామూర్తులకు మనసులోనే అంజలి ఘటించింది రమ్య! ●